# లక్కీ ఫెలో!

నా పెళ్లాం పేరు గజలక్ష్మి! అది నిజంగ మదించిన ఏనుగంత వుండకపోయినా... దాని పిల్లంత వుంటుంది. అయినా అందంగా వుంటుంది! దాని బ్యూటీని చూసే పెళ్లి చూపులనాడు బొక్క బోర్లపడ్డాను! ఫ్లాటైపోయాను.

మా అవిడ గయ్యాళిదని తర్వాత తెలిసినెత్తి నోరు మెత్తుకున్నాను. అంతా అయ్యాక ఐ మీన్... దాని మెళ్లో మూడు ముళ్లూ వేసి... తలంబ్రాలు పోసి నాతిచరామి అన్న తర్వాత ఏడ్చి ఏం ప్రయోజనం? అందుకే నోరు నొక్కేసుకున్నాను.

అదేమంటే నా మీదకు ఒంటికాలిమీద లేస్తుంది. బండ బూతులు తప్పించి తెలుగు బాషతో గల తిట్లన్నీ తిడుతుంది. తిట్లను ఎన్నాళ్లు కంఠోపాఠం చేసిందో ఈ మహాఇల్లాలు? ఆడ వాళ్లు... అందునా నాగరిక లేడీసుకు తిట్లొచ్చని నాకు తెలియదు. లోక్లాస్ లేడీస్ తిట్టుకోవటం ఎరుగుదును.

'ఒసేవ్ గజం... అట్లా తిట్లి నోరు కంపు చేసుకోకే... నోటి ఇంపుపోతోంది' అంటూ వుంటా నేను రైటర్ గాడిని కావటంతో.

'మీరు రైటర్‌ని తెలియకే... అమాయకపు మోహం దాన్ని... ఏదో ఎర్రగ బుర్రగ వున్నారుక దాని మెడవంచి తాళికట్టించుకున్నాను... తలంబ్రాలు పోయించుకున్నాను... ముగ్గురు పిల్లలను కని మునల్దానయ్యాను! కాపురానికొచ్చాక్కదా తమరు రైటరని తెలిసే ఏడ్చింది. ముందే మీ గురించి తెల్సి వుంటే పెళ్లి చూపులకొస్తామన్నప్పుడే పుట్టింటారింటి గడప కూడా తొక్కనిచ్చే దాన్నే కాదు. నాకు రైటర్సంటే వళ్లు మంట! మా ఆడవారని రాక్షసుల్లా... విలన్లలా తమ కథల్లో చిత్రీకరిస్తూంటారు. కనురెప్ప పాటులో ఆడవారు లవ్‌లో పడ్డట్టు రాయటం నాకు బొత్తిగా నచ్చదు. అలాంటి బోడి కథలు రాస్తేనేం? రాయకుంటే నేం? మాటలతో 'తాషామరప' వాయించేసింది.

'సొసైటిలో నాకున్న పరువు తీస్తున్నావు కదే గజమా!' అన్నానే గాని మాటల్తో నన్నెక్కడ కుళ్ల బొడుస్తుందోని మనసులో భయంతో వణికి పోతున్నాను.

ఇదేం పెళ్లామో గాని.. ఇంటికో మంత్లీనిగాని వీక్లీని గాని తేనివ్వదు. తెచ్చినా... దాన్ని కంటపడకుండా ఎక్కడో రహస్యంగా దాచి... అది ఇంట్లో లేని సమయంలోనో నిద్రపోయే టప్పుడో చదవి చావాల్సిందే! తేవటం దాని కంటపడితే ఏ

తెలుగుపుస్తకాన్నైనా సరే చింపి పోగులు పెడుతుంది. కారణం ఏమిటని ఒకరోజు నిలదీస్తే... ఆమె గారు ఇంగ్లీషు మీడియంలోనే డిగ్రీ చేసిందనీ... తెలుగు అక్షరం ముక్క రాదని... అందుకే తెలుగు భాషంటే ఎలర్జీ అని ఏవేవో కుంటి సాకులు చెప్పి చిటపటలాడింది.

తెచ్చుకున్న తెలుగు పుస్తకాన్ని ఎంతో జాగ్రత్తగా దాచుకున్నా... 'పోలీస్ డాగ్'లా వాసన పట్టేస్తుంది. దాన్ని దొరికిపుచ్చుకుని నామీద 'వార్' ప్రకటిస్తుంది. ఆరోజు నాకు పస్తే తిండి తినే యోగం లేకుండా చేస్తుంది మహా ఇల్లాలు!

భర్త రైటరైతే ఏ ఆడదైనా సంతోషిస్తుంది, గర్విస్తుంది. మాగజం అందుకు విరుద్ధం! అది పరమ గయ్యాళి... అపరకాళి కావటంతో దానిపై చెయ్యెత్తలేను. ఎత్తితే నన్నెక్కడ కుళ్ల పొడుస్తుందేమోనే భయం!

నాకొంపలో ఫిమేల్ డామినేషన్ రాజ్యమేలుతోంది. అన్నింటికీ నేను సర్దుకుపోవాల్సిందే! ఈ గంప గయ్యాళి కొంపలో అడుగిడినప్పటి నుంచి నాకు మనశ్శాంతి కరువైంది.

కథ రాయటానికి వుపక్రమిస్తే చాలు... నా మూడ్ సర్వనాశనం చేస్తుంది. అందుకే ఇంట్లో రాతకోతలు మానేశాను. ఆఫీసులోనే ఆపని పూర్తి చేసుకోవటానికి అలవాటు పడాల్సి రావటం నా బ్యాడ్‌లక్!

అది నోరు విప్పిందంటే చాలు.. నాకు పక్షపాతం వచ్చినట్టుంటుంది మాటపడిపోతుంది. నానోరెత్తనీయదు. ఏకపక్షవాగుడే దానిది!

పస్తులెందుకే వుంచుతావంటే... ఉపవాసం వంటికి ఆరోగ్యకరం అంటుంది. కొలెస్ట్రాల్ తగ్గుతుందంటుంది. బరువు తగ్గితే బి.పి. రాదంటుంది!- దీని దుంప తెగిపోను. క్రితం జన్మలో ఇది లేడీ డాక్టరై వుండి వుండాలి!... ఈ జన్మలో నా పాలిటపడింది! నన్ను వేపుకు తింటోంది. హింసిస్తోంది.

ఏం చేస్తాను? దాని నెత్తిన జీలకర్ర బెల్లం పెట్టి చిటికిన వేలు పట్టుకుని అగ్ని చుట్టూ ప్రదక్షిణాలు చేసి 'నాతి చరామి' అనటం తప్పైపోయింది. భరించాలి! తప్పదు మరి... నోరు నొక్కేసుకున్నారు.

నేనేమో నాజూగ్గా... అగ్గిపుల్ల లాగానో.. దర్భపుల్లలాగానో స్లిమ్ గా వుంటాను. లిమిట్‌గా తింటాను. నా హద్దులో నేనుంటాను! వేపుళ్లు.. చిరుతిళ్ల జోలికిపోను. ఇలాంటి ఉత్తమోత్తమమైన అలవాట్లు వున్న నాకు... కొలెస్ట్రాల్ వస్తుందంటుందేమిటి

చెప్మొని వాపోవటం నావంతైంది!

అమాటకొస్తే.... అదే మా అవిడ... పిప్పళ్ల బస్తాలా వుంటుంది!... రుబ్బురోలులా వుంటుంది! తాటకి.. పూతన లావుంటుంది!... బియ్యం బస్తాలా వుంటుంది!

ఆటోలో ఇద్దరం పట్టి చావం!... అది దాని సైజు! పదిగజాల చీర ప్రత్యేకంగా నేయించాలి పోచంపల్లి వెళ్లి. ఐదు మీటర్ల రవికె గుడ్డ అవసరం పడుతుంది. నాసంపాదనంతా దాని గుడ్డలకే సరిపోతుంది.

ముప్పొద్దులా పళ్లు తోముకుంటుంది. పాతిక టూత్‌పేస్ట్‌ల ఖర్చు గజలక్ష్మికి. రోజూ దాని వీపు నేను రుద్దేడవాల్సిందే. ఎంతచేతంనటే వీపు తోము కోవటానికి అమెకు చేతులు అందవ్ అందుకని! ఎందుకొచ్చిన ఏడుపని వీపు తోముకునేటందుకు 'లాంగ్ బ్రష్' కొనిపెట్టాను.

నా సరసన కూర్చొని భోజనం చేసి ఎంతోకాలమైంది. ఒంటరిగా కూర్చుని లాగిస్తుంది.... బకాసుర తిండి కదా?- ఛ! తప్పు భార్య గురించి హేళనగా మాట్లాడరాదు... కళ్లు పోతయ్!

వంద కేజీల బియ్యం బస్తా తెచ్చి కొంపలో పడేస్తే... పదిహేను రోజులకే అయిపోతయ్!

ఇహ... మంచం ఎక్కింది మొదలు ఒకటే గురక! దాని గురక దెబ్బకు నాకు నిద్ర పట్టి చావదు. అందుకే మరో బెడ్‌రూమ్‌లోకి షిఫ్ట్ అయ్యాను. దాని సరసన నిద్రించాలంటేనే భయం. నిద్రలో అది కాళ్లు... చేతులు నామీద వేస్తే... నేను 'అప్పచ్చి' అవాల్సిందే! అదే నా భయం.

ఇదీ మా దాంపత్యంలో గల అన్యోన్యత! నేను లక్కీ ఫెలోని కాక ఏమౌతాను?!

తద్దినం నాడైతే... రెండు డజన్ల గారెలు... అరకిలో అల్లప్పచ్చడి వుడేస్తుంది. మాంఛి తిండి పుష్టి గల ఆడది కాబట్టే... అది ఆరుగురు పిల్లలను అవలీలగా కనేసింది. అన్ని పురుళ్లూ మంత్రసాని ఇంట్లోనే పోసింది. ఆవిధంగా కాన్పులకు హాస్పిటల్ ఖర్చు సేవ్ చేసుకునే అవకాశం నా శ్రీమతి కల్పించినందుకు తెగసంబరపడ్డాను. ఈ విషయంలో నేను లక్కీ!

అందుకే... అదంటే నాకు పంచప్రాణాలు!

'ఇదిగో రైటర్ మొగుడూ!- నే చెప్పేది కాస్త చెవినేసుకో... పిల్లలు టెన్త్, ఇంటర్... డిగ్రీల్లో కొచ్చారనే విషయం గుర్తుందా?- మీ కవర్ల... పోస్టల్ స్టాంపులు... కొరియర్ ఖర్చు... తెల్లకాగితాల ఖర్చు ఇన్నేళ్లుగా పెట్టకుండా సేవ్ చేసివున్నట్టయితే ఇద్దరి పిల్లల పెళ్లి ఖర్చుకు సరిపోయేది. మీరు రాస్తున్న వాటల్లో ఒకటోవంతైనా అచ్చై ఏడవటం లేదు. ఎందుకొచ్చిన ప్రయాస! రిటైరైతే మీకు ఫెన్షన్ కూడా రాదు. మరి పిల్లల పెళ్లిళ్లు ఎలా చేద్దామనుకుంటున్నారో?-'

'నిన్ను అమ్మేస్తాను హరిశ్చంద్రుడిలా... సరేనా?-'

'నన్ను అర్ధరూపాయి క్కూడా ఎవరూకొనరు. ఎందుకని అంటారేమో?... నేను తిండికి తప్పమరెందుకూ పనికి రాను కనుక!- అండ్రస్టాండ్...'

'అర్ధమైంది లేవే! అందుకే నవలలపోటీకి వెయ్యి పేజీల నవల మొదలు పెట్టాను. ఫస్ట్ ప్రైజ్ ఎంతో తెలుసా? పది లక్షలు. పదిలక్షలూ గెల్చుకునేది మనమే! తర్వాత... ఆ సబ్జక్ట్ ఏ సినీ నిర్మాతకో ఓ పాతిక లక్షలకు అమ్మేస్తా!... అటుపై... అయిదు వేల ఎపిసోడ్స్ వచ్చే విధంగా స్క్రిప్ట్ తయారు చేసి టీ.వీ సీరియల్‌గా ఏనిర్మాతకో తలంటుతా! అప్పుడెంత ఆదాయమో తెలుసా? అంతా కలిసి... వెరిసి... రమారమి యాభై లక్షలు! ఆ డబ్బుతో అరడజను మంది కూతుళ్ల పెళ్లిళ్లు దర్జాగా చేసేస్తా... ఏమనుకున్నావో? నన్నెప్పుడూ తక్కువగా అంచనా వేయకు ! నీ మెడలో తాళికట్టిన వేళా విశేషమో ఏమో నాకథలకు పోటీల్లో ముచ్చటగా మూడు సార్లు ఫస్ట్ ప్రైజులు వచ్చినయ్. అమొత్తాన్ని ఎఫ్.డి.లో వేసి వుంచాను...' గర్వంగా మీసం లేకపోయినా మూతిమీద చెయ్యి వేసి మరీ చెప్పాను.

'అవునూ రైటరూ! నావల్లే నువ్వు లక్కీఫెలో అయింది! నేను నీకు అర్ధాంగై ఇంట్లో అడుగుపెట్టినప్పటినుంచే రచయితగా నీకు దశ తిరిగింది. కానీ నాకు ఒక్క ధర్మవరం పట్టుచీరె అయినా కొనిపెట్టని పిసినారి రైటర్‌వి నువ్వు...' చురకేసింది గజలక్ష్మి.

'ఆడపిల్లల కోసం 'సేవ్' చెయ్యాలి కదా?!-'

'సరే సరే... ఇకముందుకూడా నా మాటకాదని తిక్క వేషాలేస్తే... నేను 'డైవోర్స్' ఇవ్వటం ఖాయం! అప్పుడు ఏడ్చి ప్రయోజనం వుండదు...'

'డైవోర్సా?- నాకా? ఈ వయసులోనా?... నో నో నో ఈ రైటర్ గాడికి ఎంత అవమానం?... ఎంత అవమానం?-' నివ్వెరపోయాను.

'నేనంతే!'

'అంత మూర్ఖంగ... నిర్దయగ మాట్లాడకే!...'

'అద్సరే... నువ్వు పోటీల కోసం రాసే ఆ వెయ్యి పేజీల నవలకు ప్రైఉ రాక తిరిగొచ్చిందనుకో... అప్పుడేం చేస్తావ్?-'

తెల్ల మొహం వేసిన వాడినల్లా తెప్పరిల్లుకుని 'ఉరేసుకుని చస్తానే'.... ఠపీమని జవాబిచ్చాను.

ఆఫ్టాల్ నీ నవలకు ప్రైజు రాలేదని... నా పసుపు కుంకుమలు తుడిపేస్తారా? నా తాళి తెంచేస్తారా? నన్ను అరుగురు ఆడపిల్లలను రోడ్డు పాలు చేస్తారా?-' పొంగివచ్చే దుఃఖాన్ని అపుకోప్రయత్నిస్తూ చిర్రున చీదింది గజలక్ష్మి.

'డోన్ట్ వర్రీ! నేను లక్కీఫెలోనే గజం!- నా జాతకంలో లేటుగ శుక్ర మహర్దశ మొదలైందని మొన్న జాతకం చూపించగా సిద్ధాంతి చెప్పాడు. అకస్మిక ధనలాభ యోగం వుందని! నొక్కి వక్కాణించాడే ఆయన! కాబట్టి నేను... పోటీలకు రాసిపంపే నవలకు ఏం దిగుల్లేదు...'

'నిజంగానా? సిద్ధాంతి గారిని సంప్రదించిన విషయం నాకెందుకు చెప్పలేదు మరి...' అనేసి నన్ను అమాంతం కౌగిలించుకుని గిరగిరా తిప్పింది గజలక్ష్మి. ఆ తర్వాత నేల మీద కూలేసింది.

'చచ్చాన్రో దేవుడో... నా నడుము విరిగిపోయింది కదే... నీకు కోపం వచ్చినా... ప్రేమ కలిగినా నాచావుకే వస్తోంది...'

'వుండండి. నడుముకి 'మువ్' రాసి వేన్నీళ్ల కాపటం పెడతాను...' అంటూ కిచన్‌లోకి దారి తీసింది.

హఁ! నేను లక్కీఫెలోని కాబట్టే ఎత్తి కుదేసినా చావకుండా బ్రతికాను... అనుకుని వెయ్యి దేవుళ్లకు మొక్కేను? అటుపై శ్రీమతికీ మొక్కాను!!

(సమాప్తం)